క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయమే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాల అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు చీర, సారె, పిండివంటలు తదితరవాటిని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ద్వాదశి వేడుకలు



బాలాజీ కల్యాణ మండపంలో పుష్పాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అనంతరం వచ్చే ద్వాదశి వేడుకలను ఆదివారం గుడిపాటిగడ్డలోని వేంకటేశ్వరస్వామి, బాలాజీకల్యాణ మండపం, సంజీవనగర్ రామాలయంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. బాలాజీ కల్యాణ మండపంలో స్వామి వారికి 15 రకాల పుష్పాలతో పుష్పార్చన చేపట్టారు. గుడిపాటి గడ్డ ఆలయంలో మూలమూర్తిని బంగారు కవచంతో అలంకరించారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కింద నున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందిస్తున్నామని వివరించారు.

హుండీ సొమ్ము లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలో రూ.1,36,962 రాగా, రెగ్యులర్ హుండీ నుంచి రూ.1,41,084 ఆదాయం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ రామాంజనేయ శర్మ, ఆలయ అర్చకుడు ప్రహ్లాదాచారి, కృష్ణమాచారి, దండె సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ నంద్యాల శాఖ, సెవెన్ హిల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక విక్టోరియా రీడింగ్ రూమ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ అధ్యక్షుడు దండె దస్తగిరి మాట్లాడుతూ పట్టణంలోని హరిజనపేట, బస్టాండ్ ఏరియా, పెద్దబండ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కంటి, ఎముకలు, గుండెకు సంబంధించిన వ్యాధులు, జనరల్ మెడిసిన్ విభాగాల్లో వైద్య సేవలు ఉచితంగా అందించామన్నారు. ఆసుపత్రి డైరెక్టర్ భారతికుమార్, విజయభాస్కరరెడ్డి, శ్రీకాంతరెడ్డి, క్రాంతికిరణ్, మాజీ గవర్నర్‌లు శ్రీరామమూర్తి, చిన్నపరెడ్డి, రామలింగారెడ్డి, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి కింద పడి వ్యక్తికి గాయాలు

రుద్రవరం: మండలంలోని తిప్పారెడ్డిపల్లె సమీపంలో ఆదివారం మోటార్ సైకిల్‌పై నుంచి కింద పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దొర్నిపాడు మండలం డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామానికి చెందిన ప్రసాదరెడ్డి బైక్‌పై రుద్రవరం వైపు వెళ్తుండగా తిప్పారెడ్డిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డాడు.దీంతో తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కాసులు కురిపిస్తున్న ప్రకటనలు



ఆటోతో ప్రచారం చేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలో ఏ వ్యాపారానికి సంబంధించిన ప్రచారం చేయాలన్నా మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరి. ఇలాంటి ప్రచారాలు ప్రకటనలపై మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పట్టణంలో ఒక ఆటో ద్వారా ప్రచారం చేస్తే రోజుకు రూ.5వేలు రుసుం చెల్లించాలని నిబంధనలు పేర్కొంటున్నాయి. అయితే వాటిని ఉల్లంఘించి రోజులో పదుల సంఖ్యలో ఆటోల ద్వారా వ్యాపారాలకు సంబంధించిన ప్రచార ప్రకటనలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇలాంటి వాటిపై మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు ప్రభుత్వానికి రావాల్సిన రుసుమును వసూలు చేయకుండా చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మోసం..: 2014 ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు ఉయ్యాలవాడ మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామానికి ప్రచారం నిమిత్తం వచ్చి.. గ్రామానికి ప్రధాన సమస్యలైన కుందరవాగుపై వంతెన నిర్మిస్తాం, రోడ్డు వేయిస్తాం.. మమ్మల్ని నమ్మండి అంటూ జనాలను ప్రాధేయపడ్డారు. ఎట్టకేలకు గెలిచారు.. అయితే వారి పాలన కాలం పూర్తయినా వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు.

చిత్తశుద్ధి..: అది 2019 ఎన్నికల సమయం.. పోచా బ్రహ్మానంద రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి అదే గ్రామానికి ప్రచారానికి వెళ్లారు. స్థానికులు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. గెలిచిన తరువాత పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత గ్రామాభివృద్ధికి రూ. రూ.15.72 కోట్లు మంజూరు చేయించారు. రోడ్డు పనులు పూర్తి చేయించగా, బ్రిడ్జి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అంతే కాకుండా గ్రామానికి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్ల నిర్మాణినికి రూ. కోట్లు మంజూరు చేయించారు.

ప్రగతి పరుగులు

- కుందరవాగుపై నూతన వంతెన నిర్మాణం పూర్తి
- దశాబ్దాల కల నెరవేరిన వేళ
- టీడీపీ పాలనలో హామీలతోనే సరి
- గ్రామాభివృద్ధికి రూ.15.72 కోట్లు



ఉయ్యాలవాడ నుంచి ఆర్.పాంపల్లెకు నూతనంగా నిర్మించిన తారురోడ్డు



నాడు: ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో కుందర వాగుపై భూమికి సమాంతరంగా వున్న వంతెన



నేడు: ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కుందరవాగుపై నిర్మించిన హైలెవెల్ వంతెన

ఉయ్యాలవాడ : టీడీపీ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది ఉయ్యాలవాడ మండలం. ఆర్.పాంపల్లెకు రోడ్డు వేస్తామని, కుందరవాగుపై వంతెన నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చి, ఓట్లు వేయించుకుని గెలిచిన అనంతరం వాటిని పట్టించుకోలేదు. అయితే 2019 ఎన్నికల ముందు అదే గ్రామానికి ఓట్ల కోసం వచ్చిన పోచా బ్రహ్మానందరెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. వారు గెలవడంతో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రామాభివృద్ధికి రూ.15.72 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఉయ్యాలవాడ నుంచి ఆర్.పాంపల్లె మీదుగా కొండుపల్లె వరకు 9.5 కి.మీ. తారు రోడ్డును రూ. 5.72 కోట్లతో పూర్తి చేశారు. అలాగే ఆర్.పాంపల్లె నుంచి కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి కలుపుతూ రూ.4.50 కోట్లతో తారురోడ్డు వేయించారు. ఆర్.పాంపల్లె సమీపంలో రూ. 5.50 కోట్ల వ్యయంతో కుందరవాగుపై హైలెవెల్ నూతన వంతెన 7.50 మీటర్ల వెడల్పు 115 మీటర్ల పొడువు, 6 మీటర్ల ఎత్తు, వంతెన కింది భాగంలో 10 మీటర్ల వెడల్పుతో వర్షం నీరు వెళ్లేందుకు 11 గండ్లుతో పూర్తి చేశారు. ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వారం రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ వెంకటసుబ్బయ్య తెలిపారు.

బ్రిడ్జి చూస్తాననుకోలేదు



ప్రస్తుతం నా వయస్సు 82 సంవత్సరాలు. ఊహ తెలిసినప్పటి నుంచి నడుచుకుంటూ ఉయ్యాలవాడకు వెళ్లి అక్కడి నుంచి వాహనాల్లో వెళ్లే వాళ్లం. వర్షాకాలం కుందరవాగుపై వర్షపు నీరు ప్రమాదస్థాయిలో పారుతుంది. పొలాలకు, ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా వాగు దాటాల్సిందే. 2009లో పశుగ్రాసం కోసం వెళ్లి నా కోడలు లక్ష్మీదేవి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందింది. మా ఊరికి రోడ్డు, వంతెన చూస్తాననుకోలేదు. సీఎం జగన్ పుణ్యమా అని మా ఊరికి రోడ్డు, వంతెన నిర్మించడం చాలా సంతోషంగా ఉంది.

– పెద్దన్న యాదవ్, ఆర్.పాంపల్లె

జీవితకాలం గుర్తుండిపోతుంది



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. ఎంపీ, ఎమ్మెల్యే చొరవతో గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మా గ్రామంలో నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఎప్పుడూ జరగని అభివృద్ధి ఇంత పెద్ద ఎత్తున జరగడం జీవితకాలం గుర్తిండిపోతుంది.

– చాబోలు లక్ష్మిదేవి, సర్పంచ్, ఆర్.పాంపల్లె

ప్రభుత్వానికి రుణపడి వుంటాం



ఎన్నికల ముందు మా గ్రామానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. మా గ్రామం నుంచి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. మా గ్రామంతో ఇతర గ్రామస్తులు, బంధువులు..పెళ్లి సంబంధాలు కలుపుకునేందుకు ఇష్ట పడేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ రూపురేఖలు మారిపోయాయి. చుట్టూ రహదారులే కాకుండా కుందరవాగుపై వంతెన నిర్మాణం పూర్తయింది. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– కందుల వెంకటసుబ్బారెడ్డి, ఆర్.పాంపల్లె

మేనల్లుడిని కోల్పోయా



నా అన్న కొడుకు సతీష్ కుమార్ ఇక్కడే ఉండి ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు వచ్చాడు. పాఠశాలకు వెళ్లేందుకు కుందరవాగుపై నీరు ఉన్న సమయంలో దాటుతుండగా ప్రమాదవశాత్తు కొట్టుకుపోయి మృతి చెందాడు. ప్రస్తుతం వాగుపై నూతన వంతెన నిర్మాణం, రహదారి వేయడం సంతోషంగా ఉంది.

– బంకా లక్ష్మిదేవి, ఆర్.పాంపల్లె



ఈనెల 30వ తేదీన నంద్యాలలోని గాంధీచౌక్‌లో నిర్వహించే సామాజిక బస్సుయాత్రను విజయవంతం చేయడంలో భాగంగా పట్టణంలో ఆదివారం నంద్యాల, గోస్పాడు మండలాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి, చిత్రంలో పీపీ నాగిరెడ్డి

చర్చిలకు క్రిస్మస్ శోభ



విద్యుద్దీపాలంకరణంలో ఆల్‌సెయింట్ చర్చి



పెద్దకొట్టాలలో ఆర్‌సీఎం చర్చి ముస్తాబు



చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువుల పాక



విద్యుద్దీపాలంకరణలోని ఆర్‌సీఎం చర్చి



యాళ్లూరులో చర్చిని అలంకరించిన దృశ్యం



ఆళ్లగడ్డలో విద్యుత్ దీపాలతో సుందరంగా చర్చి

నంద్యాల(న్యూటౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిల్లాలోని పలు చర్చిలు విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. ప్రముఖ క్రైస్తవ ఆలయాలు విద్యుత్ దీపాలంకరణతో, రంగురంగుల పేపర్‌లతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి, పాస్టరేట్-2 ఆల్‌సెయింట్ చర్చి, పాస్టరేట్-3 ఆలయం, డేనియల్‌పురం సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం, ఏసుకృప, హోసన్న, వైఎస్సార్‌నగర్ క్రిస్టియన్ అసెంబ్లీ తదితర సంఘాల చర్చిలను సుందరంగా అలంకరించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం విద్యుత్ దీపాల వెలుగులతో ఆకట్టుకుంటోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు సంఘ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1(పెద్ద చర్చి)లో రైట్ రెవరెండ్ ఐజక్ వరప్రసాద్, బిషప్ దైవ సందేశం ఇస్తారు. పాస్టరేట్-2 ఆలయంలో డీసరీ చైర్మన్ ఇమ్మానియేల్ బాబు, మిట్నాల సీఎస్ఐ ఆలయంలో విక్టర్‌బాబు క్రిస్మస్ సందేశం ఇస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

పట్టణంలోని క్రాంతినగర్‌లోనున్న శాంతినికేతన్ పాఠశాలలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. విద్యార్థులకు క్రీస్తు సందేశాన్ని అందించారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో శాంతితో ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని చైర్మన్ సుధాకర్ తెలిపారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి సంబరాలు చేసుకున్నారు.

గోస్పాడు: మండంలోని గ్రామాల్లో చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. క్రిస్మస్ సందర్భంగా అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లను నిర్వాహకులు సిద్ధం చేశారు.

ఆళ్లగడ్డ: ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా జరుపుకునే క్రిస్మస్‌కు సంబంధించి నియోజకవర్గంలోని చర్చిలను సుందరంగా ముస్తాబు చేశారు. ఏసుక్రీస్తు జననం తీరును వివరించే పాకలను ఏర్పాటు చేశారు. అలాగే వివిధ ప్రైవేటు పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం జరుపుకున్నారు. పట్టణం పరిధిలోని సీఎస్ఐ, ఇమ్మానియేల్, రెహబోతు, ఆర్సీఎం, హోసన్న, పెంతకోస్తు, గెస్సెమనే, జోసఫ్, ఏసుకృప తదితర మందిరాల పాస్టర్లు అర్ధరాత్రి అనంతరం శిలువనుచేత పట్టుకుని ఇంటింటికీ వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు.

దొర్నిపాడు: క్రైస్తవులకు అంత్యంత ముఖ్యమైన పండుగ క్రిస్మస్. సోమవారం ఈ పండుగను వైభవంగా జరుపుకునేందకు సిద్ధం అయ్యారు. ఇప్పటికే చర్చీలన్నీ రంగుల కాగితాలు, విద్యుత్ దీపాలతో విరాజిల్లుతున్నాయి.

భగవద్గీత మతగ్రంథం కాదు



గెలుపొందిన విద్యార్థులతో ఎంపీ పోచా

నంద్యాల(వ్యవసాయం): భగవద్గీత మతగ్రంథం కాదని, మానవుని జీవన విధానాన్ని నిర్దేశించే, నడిపించే గ్రంథమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో భగవద్గీత కంఠస్థ, పఠన పోటీలకు హాజరయ్యారు. శారదా జ్ఞాన పీఠం పీఠాధిపతి శ్రీశివయోగేంద్ర సరస్వతి మాట్లాడుతూ భగవద్గీతను ఆచరిస్తే భవబంధములను పారదొలి జీవన ముక్తిని ప్రసాదిస్తుందన్నారు. విద్యార్థులకు బాల్యం నుంచే భగవద్గీతను నేర్పించాలని చెప్పారు. అనంతరం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి పోటీల విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. రాంప్రసాద్, రామశేషు, మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దాం



యోగా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ప్రముఖ యోగా గురువు కండే ఆనంద్ గురూజీ కోరారు. ఆదివారం స్థానిక మున్సిపల్ టౌన్ పార్కులో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఆయూష్ యోగా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ యోగా కేంద్రం సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆడుదాం ఆంధ్రలో పాల్గొని భాగస్వాములు కావాలని కోరారు. యోగా గురువు యోగా లాభాలను వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఇంజనీర్ మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరెడ్డి, నాగరాజు, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి

నంద్యాల(సిటీ): ఆడుదాం ఆంధ్రకు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సచివాలయ అడ్మిన్లు, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కాగా.. సమావేశానికి గైర్హాజరైన సచివాలయ అడ్మిన్లు, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బందికి షోకాజు నోటీసులు ఇచ్చి 24 గంటలలోగా వివరణ ఇవ్వాలని కోరారు.

హక్కుల కోసం ఉద్యమిద్దాం

నంద్యాల(అర్బన్): గిరిజనులు సంఘటితమై హక్కుల కోసం ఉద్యమించాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ తెలిపారు. జనవరి 7వ తేదీన విజయవాడలో జరిగే గిరిజన శంఖారావం గోడపత్రికలను ఆదివారం స్థానిక కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. రవినాయక్, రాజారాంనాయక్, జయరాంనాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలికి ‘ఆడుదాం ఆంధ్రా’



నాలుగు రోడ్ల కూడలిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడంతో పాటు ఆరోగ్యకమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ‘ఆడుదాం ఆంధ్రా’ పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తుందని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న క్రీడా పోటీలపై క్రీడాకారులకు అవగాహన కల్పించడంలో భాగంగా ఆదివారం పట్టణంలో అవగాహణ ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మహబూబ్ ఖాన్, మున్సిపల్ ఏఈ సురేంద్ర పాల్గొన్నారు

రుద్రవరం: ఆడుదాం ఆంధ్రా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయులు,పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీంల ఫార్మేషన్, మైదానలు, వసతుల పనులు పూర్తి చేయాలని చెప్పారు.

జగనన్న హయాంలో పాదర్శక పాలన



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గంగుల అవంతిరెడ్డి

ఆళ్లగడ్డ: సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు జరగాలంటే జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గంగుల అవంతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గాయిత్రీ దేవాలయం వీధిలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకే పథకాలు లభించేవని విమర్శించారు. ప్రస్తుతం అర్హులకు మాత్రమే పథకాలు అందజేస్తున్నారని, అవి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, సోముల రాధ, న్యాయవాది సరిత, రాజారెడ్డి, నజీర్ ఉన్నారు.

ఎస్టీ పునరుద్ధరణ బిల్లు పెట్టాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే పునరుద్ధరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులి కొండన్న, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్టీ పునరుద్ధరణ బిల్లును అసెంబ్లీ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపి 8నెలలు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లు ఆమోదం పొందేలా చూడాలన్నారు.నాయకులు రవి, సురేష్, రాఘవేంద్ర, శ్రీనివాసులు, చిన్ననాయుడు పాల్గొన్నారు.

పచ్చగా ఉంటే ఓర్వలేరా?

- సాగునీటిపై రాజకీయం తగదు
- మాజీ మంత్రిపై మండిపడుతున్న రైతాంగం



చెరువు నీటిని మడవ ద్వారా పారించుకుంటున్న రైతు



నీటితో కళకళలాడుతున్న ఎర్రగుడిదిన్నె చెరువు

రుద్రవరం: రాజకీయాలు తమకు అక్కర్లేదు.. కేవలం వ్యవసాయమే మాకు ప్రధానం.. అలాంటిది సాగునీటిపై టీడీపీ రాజకీయం చేయడం ఏంటని మండలంలోని ఎర్రగుడిదిన్నె, చందలూరు, మందలూరు, మాచినేనిపల్లె తదితర గ్రామాలకు చెందిన రైతాంగం మాజీ మంత్రి అఖిలప్రియపై మండిపడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.అయితే అప్పటికే రైతులు సాగు చేసిన వివిధ పంటలు వాడు ముఖం పట్టాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఏపీ జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ కాల్వల ద్వారా వార బందీ పద్ధతిలో సాగునీరు విడుదల చేయించారు. దీంతో పంటలకు నీటితడులు అందించి మంచి దిగుబడులు, గిట్టుబాటు ధరలు లభించి లాభాలు గడించారు. ఇంకా కాల్వలు పారుతుండటంతో రెండో పంటగా జొన్న,వరి,మొక్కజొన్న,మినుము,మిర్చి వంటి పంటలు సాగు చేశారు. ఎర్రగుడిదిన్నెలో ఎమ్మెల్యే బంధువులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దిగువకు నీరు పారకుండా అడ్డుకున్నారని ఆ నీటిని వారి చెరువుకే మళ్లించుకొని చేపల పెంపకానికి వాడుకుంటున్నారని అవాస్తవాలు మాట్లాడటం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఆ చెరువు కింద సాగైన తమ రెండో పంట చివరి దశలో ఉందని, నీరు విడుదల చేయకపోతే పంటల సాగు ఎలా సాధ్యమవుతుందని, క్షేత్రస్థాయిలో తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని ఎర్రగుడిదిన్నె రైతులు అభిప్రాయపడ్డారు.

చెరువు నీటితోనే పంట సాగు



ఎర్రగుడిదిన్నె చెరువు కింద 20 ఎకరాల పొలం ఉంది. మొదటి పంటగా మినుము వేసి తెగుళ్లతో పూర్తిగా నష్ట పోయాం. పొలాలను బీడుగా వదిలేశాం. ఆ సమయంలో తెలుగుగంగ కాల్వల ద్వారా సాగు నీరు వస్తుందని ఎమ్మెల్యే చెప్పడంతో జొన్న పంట వేశా. ఇప్పటి చెరువు తూము గుండా వచ్చే నీటితో పంటకు మూడు తడులు నీరు పారించుకున్నా. అయితే వైఎస్సార్‌సీపీ నాయకుడు చేపల కోసం నీటిని నిల్వ చేసి రైతులెవ్వరికి పారనీయడంలేదని, దాంతో పంటలు ఎండుతున్నాయని మాజీ మంత్రి చెప్పడం సమంజసం కాదు.

– వీరారెడ్డి,రైతు,ఎర్రగుడిదిన్నె

తెలుసుకొని మాట్లాడాలి



ఏదైనా మాట్లాడే ముందు తెలుసుకోవడం మంచిది. మాజీ మంత్రి అలా మాట్లాడటం బాగలేదు. గంగుల కుటుంబం వల్లే సాగు నీరు సమృద్ధిగా అందుతుంది. నాకున్న ఆరెకరాల్లో జొన్న పంట సాగు చేశా. ప్రస్తుతం మూడో తడి నీరు పారించుకునేందుకు మడవ వేస్తున్నా. ఈ తడితో పంట పండి పోయినట్లే. నీటిని విడుదలకు కృషి చేసిన వారిపై ఆరోపణలు చేయడం సరికాదు.

– మదార్ సాహెబ్,రైతు, ఎర్రగుడిదిన్నె

ఎవరినీ డబ్బులు అడగలేదు



ఎర్రగుడిదిన్నెలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉండేది పుట్టాలమ్మ క్షేత్ర చైర్మెన్ గంగుల మనోహర్‌రెడ్డి. ఆయన రైతుల క్షేమం కోసం చెరువు పరిధిలోని కాల్వల పూడిక తీయించి నీరు సవ్యంగా పారేలా చేశారు. సక్రమంగా నీరు పారుతుంది. డబ్బులు ఇస్తేనే సాగు నీరు ఇస్తామని అనలేదు. ఇవేవీ తెలుసుకోకుండా రైతులను రూ.5లక్షలు అడిగారని ఆరోపించడం మంచిదికాదు. రైతులపై రాజకీయం చేయడం మంచిదికాదు.

– శ్రీనివాసులు రైతు ఎర్రగుడిదిన్నె

సాగు నీటిపై రాజకీయమా?



రైతులకు అందించే సాగు నీటిపై రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదు. 19వ బ్లాక్ కాల్వ ద్వారా దిగువకు నీటిని విడుదల చేయకుండా చేపల పెంపకం కోసం ఎర్రగుడిదిన్నె చెరువుకు నింపుకున్నారని, ఐదు లక్షలు ఇస్తే నీరు ఇస్తామని గంగుల వారు చెప్పినట్లు అఖిలప్రియ మాట్లాడటంలో వాస్తవం లేదు. వసూళ్లకు ఎవరు పాల్పడతారో నియోజకవర్గ ప్రజలకు తెలుసు. ఎన్నికలొస్తున్నాయి కదా అని ఇష్టారీతిన ఆరోపణలు చేయడం పద్ధతి కాదు.

– గంధం రాఘవరెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్